క్లుప్తంగా

అందరూ ఆనందంగా ఉండాలి



ఎమ్మెల్సీ భరత్

కుప్పం: నియోజకవర్గ ప్రజలు దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ భరత్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆయన కోరారు. ప్రతి కుటుంబం సంపద, సౌభాగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

చీరల పంపిణీ



చీరలను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్ దంపతులు

శాంతిపురం: దీపావళి సందర్భంగా శాంతిపురం, రామకుప్పం మండలాల వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది, సంఘమిత్రలకు ఎమ్మెల్సీ భరత్ దంపతులు చీరలను వితరణగా అందజేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో భరత్, ఆయన భార్య దుర్గ చీరలను పంపిణీ చేశారు. అలాగే జగనన్న కోసం జనం– భరతన్న కోసం మనంలో భాగంగా దుర్గ రాళ్లబూదుగూరు పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు చీర, పసుపు కుంకుమను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, రామకుప్పం శాంతిపురం మండలాల పార్టీ కన్వీనర్లు బాబు రెడ్డి, బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, నేతలు చంద్రారెడ్డి, చెంగప్ప, మురుగేష్ పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రతిఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు షణ్ముగం, ముఖ్య సలహాదారు రామన్న, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శిగా కృపావరమ్మ



కృపావరమ్మను సన్మానిస్తున్న సంఘ నేతలు

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (ఏపీజీఆర్ఈఏ) రాష్ట్ర కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన కృపావరమ్మ ఎంపిక కావడం ఆమె సేవా తత్పరతకు దక్కిన గౌరవంగా స్థానిక సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అన్నారు. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో కృపావరమ్మ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ రాజు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా సేవలందించిన ఆమె రిటైర్డ్ అయిన తర్వాత తన సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారని కొనియాడారు. ఆమె సేవలను గుర్తించి జిల్లాసంఘం కార్యదర్శిగా ఎంపిక చేయగా, ఇప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావడం ఆమె సేవా తత్పరతకు నిదర్శనమన్నారు. ఆమె భవన నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలోసంఘ నాయకులు గుణశేఖర్‌రెడ్డి, రామలింగం, కృష్ణమనాయుడు, సుబ్రమణ్యం అరుణాచలం, కుప్పయ్య, నిర్మలమ్మ, లలిత, సుశీల, రామూర్తి, రామచంద్ర పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి



కార్తీక్ (ఫైల్)

కుప్పం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి శనివారం మృతి చెందాడు. రామకుప్పం ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు.. ఆరిమానుపెంట గ్రామానికి చెందిన కార్తీక్ (35) దీపావళి పండుగకు నిత్యావసర సరుకులు కొనేందుకు శుక్రవారం రామకుప్పం వెళ్లాడు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఆరిమానుపెంట గ్రామానికి తిరిగి బయలుదేరాడు. మార్గమధ్యం 89 పెద్దూరు వద్దకు రాగానే అడవి జంతువులు రోడ్డుపైకి వచ్చిన కార్తీక్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాయి. ప్రమాదంలో కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని కుటుంబసభ్యులు, బంధువులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతాంగం సేవల్లో ఆర్బీకేలు!

రైతులకు అన్ని సేవలూ వారి గ్రామాల్లోనే

- ఎమ్మార్పీకే అందుబాటులో ఎరువులు, పురుగుల మందులు
- కియోస్క్‌తో డిజిటల్ ఆధారిత సేవలు
- కస్టం హైరింగ్ గ్రూపులతో వ్యవసాయ పరికరాలు
- భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు
- కౌలు రైతులకు కార్డుల మంజూరుతో రైతు భరోసా వర్తింపు



రైతులకు సేవలందిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది, ఏవోలు

పలమనేరు: రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందనే నానుడిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆచరణలో చూపుతోంది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీకే రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తోంది. రవాణా సమస్య లేకుండా అన్నీ స్థానికంగానే అందుబాటులో ఉన్నాయి. ఎరువుల ధరలపై రవాణా చార్జీలను అదనంగా మోపి బస్తాకు రూ.20 దాకా అదనంగా వసూలు చేసే ఎరువుల షాపుల్లో ఇప్పుడు వ్యాపారాలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు నిదర్శనం. అంతేకాకుండా ఏ పంటకు ఏ తెగులు సోకిందో క్షేత్రస్థాయిలో అక్కడి సిబ్బంది గుర్తించి వాటి నిర్మూలనకు సలహాలు–సూచనలు ఇస్తున్నారు. 2020 మే 30న ప్రారంభించిన ఆర్బీకేలు రైతులకు ఒక వరంలా మారాయి. గత ప్రభుత్వ పాలనలో రైతాంగం విత్తనాలు, ఎరువులు మొదలుకుని అన్నింటికీ ఇబ్బందులు పడేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

డిజిటల్ ఆధారిత సేవలు సైతం..

ఆర్బీకేల్లోని డిజిటల్ ఆధారితసేవల ద్వారా ఈ మల్టీఫంక్షనల్ కియోస్క్‌లు సాంకేతికంగా రైతుల అవసరాలకు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే మండలంలో ఈ–క్రాప్ బుకింగ్ 95శాతం చేశారు. దీని ఆధారంగానే ఆర్బీకేల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. రైతులు పండించిన పంటలకు సీఎం యాప్ ద్వారా కనీస మద్దతు ధరకు అమ్మకాలు జరిగేలా చూస్తున్నారు. మండలంలో భూసార పరీక్షల శాంపిల్స్ సేకరణ ఒక్కో ఆర్బీకేలో 30 చొప్పున తీయించి ల్యాబ్‌కు పంపారు. వీటి ఆధారంగా రైతులకు పంటల సాగుపై సూచనలు ఇస్తుండడంతో పంటల మార్పు, కావాల్సిన మేరకే ఎరువులు వేయడంతో రైతులకు పంట పెట్టుబడి ఖర్చు తగ్గి, అధిక దిగుబడి సాధిస్తున్నారు. ఫలితంగా వారి ఆదాయం పెరుగుతోంది. మండలంలోని 12 చోట్ల కస్టం హైరింగ్ గ్రూపులున్నాయి. ఇందులో వైఎస్సార్ యంత్రసేవల ద్వారా 9 ట్రాక్టర్లు, రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను రైతులు వినియోగిస్తున్నారు. కౌలు రైతులకు సైతం కార్డులను మంజూరు చేస్తుండడంతో రైతాంగం సేవలను వారూ పొందుతున్నారు. రైతుభరోసాతో ముందుగానే రైతులకు పంటపెట్టుబడి సాయం ఇస్తోంది. రైతులు పండించిన పంటలకు ఉచిత పంటల బీమా చేస్తున్నారు. 'పొలం బడి'తో రైతుల పొలాల్లోనే శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా పంటకోత ప్రయోగాలు, పంటల సాగుపై అవగాహన కల్పించేలా రైతుభరోసా మాసపత్రిక అందుబాటులో ఉంటోంది. పంట దిగుబడులను పెంచేందుకు ఆర్బీకే చానెల్ ద్వారా ప్రసారాలు చేస్తున్నారు.



మొరం ఆర్బీకేలో కియోస్క్ సేవలను ఉపయోగించుకున్న రైతులు

పలమనేరు నియోజకవర్గంలో ఆర్బీకే సేవలు

- మొత్తం ఆర్బీకేలు: **98**
- ఒక్కో ఆర్బీకేకు రూ.21.8లక్షల చొప్పున ఖర్చు: రూ.**21.71** కోట్లు
- ఒక్కో ఆర్బీకేలో సిబ్బంది: **12**
- మొత్తం మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు: **98**
- ఆర్బీకేల ద్వారా సేవలను పొందుతున్న రైతులు: **60** వేల పైచిలుకు
- మొత్తం కస్టం హైరింగ్ గ్రూపులు: **90**
- ఇప్పటికే పూర్తయిన ఆర్బీకేలు: **55**
- వివిధ దశల్లో పనులు జరుగుతున్నవి: **43**

ఒకేచోట వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది

మండలంలో ఎక్కువగా వేరుశనగ, వరి, పలురకాల కూరగాయలు సాగుచేస్తున్నారు. ఇందులో ఎక్కువగా టమాటను పండిస్తున్నారు. ఇక 30 శాతం మంది రైతులకు పట్టుపరిశ్రమ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. 60శాతం మంది రైతులకు పాడి పరిశ్రమే ఆధారం. గతంలో నాలుగు శాఖల అధికారులతో రైతులకు నేరుగా సంబంధాలు ఉండేవి కాదు. కానీ ఆర్బీకేల ద్వారా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్థకశాల సహాయకులు గ్రామాల్లో ఎల్లవేళలా అందుబాటులో ఉంటుండడంతో అన్ని రకాల సేవలు రైతులకు ఒకేచోట అందుతున్నాయి.







కొలమాసనపల్లె, టి.వడ్డూరులో ఎరువులు తీసుకుంటున్న రైతులు, మారేడుపల్లి, బైరెడ్డిపల్లిలోని ఆర్బీకేలు

ప్రభుత్వం చేసిన మేలును గుర్తుచేయండి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



సమీక్షలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

- వార్డు కౌన్సిలర్లకు సూచించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ప్రభుత్వం చేసిన మేలును జనానికి గుర్తు చేస్తూ పలమనేరులో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం కోసం అందరూ సమష్టిగా కృషిచేయాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ స్థానిక నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సాయంత్రం 16 వార్డుకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీని ఎలా మెజారిటీ తెప్పించాలనే విషయమై పలు సూచనలు చేశారు. గత టీడీపీ పాలనలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జనానికి చేసిన మోసాన్ని ఎత్తి చూపాలన్నారు. గతానికి, ఇప్పటికీ పాలనలోని తేడాను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. సమీక్షలో పట్టణ కన్వీనర్ జాఫర్, కౌన్సిలర్లు, సచివాలయ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక..

ఇదే సందర్భంగా పట్టణంలోని 16 వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నేతలు సునీల్, డేవిడ్‌లు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. తాము జగనన్న పాలనను చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు.

పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు



కేశవరెడ్డి పాఠశాలలో వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని పలు పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూబాలాజీ కాలనీలో ఉన్న కేశవరెడ్డి పాఠశాలలో ప్రిన్సిపాల్ జయంతి విద్యార్థులకు పండుగల విశిష్టతను వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. నగరపాలక కమిషనర్ అరుణ, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత, పిల్లలు దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ దీపావళి – శుభ దీపావళి కార్యక్రమాన్ని ఆర్.కే.మోడల్ పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యానికి కారణమైన, భారీ శబ్దాలు ఇచ్చే టపాసులను కాల్చవద్దన్నారు. విజయం సీబీఎస్‌ఈ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ తేజోమూర్తి మాట్లాడుతూ దీపం ఉన్న చోట జ్ఞానసంపద ఉంటుందన్నారు. తెల్లనికాంతిని పరమశివునికి ప్రతినిధిగా భావించి దీపావళి పండుగను జరుపుకుంటారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల డైరెక్టర్ శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మణీంద్రం పంచాయతీలో రాత్రి బస



రాత్రి బసలో ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని మణీంద్రం పంచాయతీలో శనివారం రాత్రి బస కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సీనియర్ నేత చంద్రమోహన్‌రెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి ఎమ్మెల్సీతోపాటు రాత్రి నిద్ర చేశారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

రామకుప్పం: మండలంలోని అయ్యప్పగానిపల్లి, వెంకటాపురం, కోట్లగూరు గ్రామాల్లో శనివారం ఎంపీపీ సుబ్రమణ్యం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీజీఎంపీ రూ.8లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. భూగర్భ డ్రైనేజీలు కావాలని ప్రజలు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌ను కోరగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ రవి, నేతలు రాఘవరెడ్డి, శంకరాచారి, జయప్ప, గోవిందప్ప పాల్గొన్నారు.

దీపావళికి సర్వం సిద్ధం



బీఎంఎస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

పుంగనూరు: దీపావళి పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పట్టణంలోని దుకాణాలు కిక్కిరిసిపోయాయి. పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. అలాగే ఎంబీటీ రోడ్డులో ప్రతి దుకాణం వద్ద పండుగ వస్తువుల విక్రయాలు ఊపందుకున్నాయి. టపాసుల ధరలు అధికంగా ఉండడంతో ఈసారి వ్యాపారాలు అంతంతమాత్రంగా ఉందని వ్యాపారులు అంటున్నారు.

దీపావళి జాగ్రత్తలు పాటించాలి...

ప్రజలందరు దీపావళి పండుగను జాగ్రత్తగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ వెంకట్రాయులు సూచించారు. ఆదివారం టపాసుల దుకాణాలను ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, సీఐ రాఘవరెడ్డి కలిసి తనిఖీ చేశారు. దుకాణాల వద్ద మట్టి, ఇసుకతోపాటు ఫైర్ మిషన్లు పెట్టుకోవాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



ఎంబీటీ రోడ్డులో దుకాణాలు

ఆర్టీఐ జాతీయ డైరెక్టర్‌గా జ్యోతిప్రకాష్



జ్యోతిప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్: ఆర్టీఐ జాతీయ డైరెక్టర్‌గా చిత్తూరు నగరానికి చెందిన జ్యోతి ప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు రైట్ టూ ఇన్ఫర్మేషన్ ఏ సొసైటీ 2005 యాక్ట్ (ఆర్టీఐ) ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభి రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని జ్యోతిప్రకాష్ పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



విద్యార్థులకు గ్రంథాలను ఇస్తున్న సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రేరణ కలిగించే వివిధ గ్రంథాలను అందజేశారు. జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహ్మదాలి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుంగనూరు: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కార్యదర్శి సీఎస్.రాజారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వైద్యశిబిరంలో వైద్యులు విజయ్‌కుమార్, విజయకుమారి, డాక్టర్ శరణ్, డాక్టర్ కౌసర్ 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సభ్యులు పూలత్యాగరాజు, సుధాకర్ రెడ్డి, జాన్, భాస్కర్‌జెట్టి, హరిప్రసాద్, ఈశ్వరయ్య, కిషోర్, భాస్కర్‌రెడ్డి, నాన బాలగణేష్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.రెండు లక్షల విరాళం



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాత



రూ.లక్ష విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి దాతలు శనివారం రూ.రెండు లక్షల విరాళం ఇచ్చారు. కాణిపాకపట్నంకు చెందిన రాజశేఖర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఉదయం స్వామి వారి దర్శనానికి వచ్చారు. వారు అన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అధికారులకు అందజేశారు. అలాగే కర్ణాటకకు చెందిన కునాల్ గౌడ్ కుటుంబసభ్యులు అన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.